# నీడనిచ్చే చెట్టు

"ఓస్! దీనిమూలంగానే యింటికిన్ని అనర్థాలు... దీన్ని కొట్టేస్తే పీడ విరగడవుతుంది."

గట్టిగా అరుస్తూ గొడ్డలి తీసుకుని వేపచెట్టుని నరకటానికి బయల్దేరేడు వీరయ్య.

దొడ్లో వేపచెట్టును చూస్తే చాలు వీరావేశం వస్తుంది వీరయ్యకి.

కిందటినెల్లో సిద్ధాంతి వొచ్చినప్పటి నుంచే ఆ చెట్టుపై అంత కోపం, పెరట్లో ఈశాన్యం మూలలో వేపచెట్టు వుంటే యింట్లో అన్నీ అనర్థాలేనని వక్కపొడి నములుతూ సిద్ధాంతి చెప్పాడు.

నెలనెలా యింటికి డబ్బు పంపే పెద్ద కొడుకు డబ్బు పంపకపోవడం, రాయిలా తిరుగుతూ పనిచేసుకునే రంగమ్మకి సుస్తీచెయ్యడం, చిన్నకొడుక్కి మంచి ఉద్యోగం దొరక్కపోవడానికి కారణం ఆ వేపచెట్టేనని వీరయ్య కనిపించింది.

చాపచుట్టలా వేపచెట్టుకింద పడుకున్న రంగమ్మ తెరచాపలా లేచి వీరయ్యకు అడ్డమొచ్చింది. భర్త వేపచెట్టుని కొట్టెయ్యాలనుకోవడం ఆమెకు సుతారమూ ఇష్టంలేదు. దాదాపు పగలంతా ఆచెట్టుకిందే ఆమె కాలక్షేపంచేస్తుంది. చెట్టుదగ్గరి నీడలోనే బట్ట లుతకడం, అంట్లు తోముకోవడం, తాటాకుల దడిలో స్నానం... వేసవికాలం ఆ చెట్టుకిందే పడక.... అందుకే నాల్గోసారి వీరయ్యకు అడ్డమొచ్చింది చెట్టు కొట్టెయ్యబోతూ వుంటే.

"చెట్టుకొట్టేస్తే మనకష్టాలు తీరతాయా ఏమిటి? దేవుడు మన తరువాత ఎలా రాస్తే అలా జరుగుతుంది.... చెట్టు మాత్రం కొట్టెయ్యడానికి వీల్లేదు" అంది రంగమ్మ.

వాళ్ళ గొడవకి సూరిబాబుకు మెలుకువ వొచ్చింది. సూరిబాబు కూడా కలుగ జేసుకుని తండ్రిని వారించడంతో వీరయ్య వెనక్కు తగ్గాడు.

బండమీద కూర్చుని మొహం కడుక్కుంటూ తండ్రి కోపానికిగల కారణాలు వెతుక్కోసాగేడు సూరిబాబు.

సిద్ధాంతి మాటలకంటే అన్నయ్య ప్రవర్తనే నాన్న కోపానికి గల కారణం.... రెండు నెలలయ్యింది అన్నయ్య డబ్బులు పంపించి.... అన్నయ్యచేత ఉత్తరం వ్రాయించింది వొదిన, డబ్బులు పంపడం వీలుపడదని... అమ్మని నాన్నని వాళ్ళ దగ్గరకొచ్చి వుండమంటారు. ఇల్లు, వాకిలి వొదిలిపెట్టి అక్కడికెళ్ళడం అమ్మ, నాన్నకి యిష్టంలేదు.

ఆ ముచ్చటా తీరింది అమ్మానాన్నకి, రెండురోజులు వుండి వొచ్చారు ఆ మధ్య. ఆ రెండురోజులూ రెండు యుగాల్లా తోచేయి.... చీటికి మాటికి వొదిన కసురుకునేదట. సోఫాల్లో కాళ్ళు పెట్టుకుని కూర్చున్నారని, అమ్మ పొద్దున్నే చద్దన్నం తిన్నదని, నాన్న చుట్టలు తాగాడని... ఏదో వొంకతో అమ్మనీ, నాన్నని ఈసడించింది వొదిన.

అన్నయ్య మునిసిపల్ కమీషనర్ అవ్వకపూర్వం తనంటే ఎంతో ప్రేమగా వుండేవాడు.

... పదోతరగతి తప్పి ప్రింటింగ్ ప్రెస్‌లో బైండర్‌గా, హోటల్లో సప్లయర్‌గా, సినిమాహాల్లో గేటుదగ్గర నిలబడి టికెట్లు చింపడం- ఎన్నో చిన్న చిన్న ఉద్యోగాలు చేశాడు తను. వున్న ఎకరం పొలం అమ్మి అన్నయ్యని బి.ఎ.చదివించేడు నాన్న. ఏదో వొక పనిచేసి ఇంటిభారం తను నెత్తిన వేసుకున్నాడు.

సర్వీస్ కమీషన్ పరీక్షలు ప్యాసయి మున్సిపల్ కమీషనర్ ఉద్యోగం దొరికేక అన్నయ్య పూర్తిగా మారిపోయేడు. అమ్మానాన్నలకి చెప్పకుండానే తను పనిచేస్తున్న ఊళ్ళోని తాసీల్దారుగారి అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. దూరపు బంధువుల్లా తామెళ్ళి పెళ్ళి చూసివచ్చేరు. పెళ్లి నుంచి తిరిగొచ్చేక అమ్మ, నాన్న ఎంత బాధపడ్డారో!

.... అన్నయ్యకి తనుచేసే మున్సిపల్ ఆఫీసులోని 'స్వీపర్' ఉద్యోగం నచ్చదు. ఆ ఉద్యోగం మానెయ్యమంటాడు. తమ యింటి సంగతి పట్టించుకోడు.... అతి కష్టంమీద సంపాదించుకున్న ఆ ఉద్యోగంకూడా మానేస్తే వస్తులుండాల్సిందే!....

"మీ ఆఫీసు వేళయిందిరా! త్వరగా తెములు!" రంగమ్మ హెచ్చరించడంతో, గబగబా వేపపుల్ల నమిలేసి, మొహం కడుక్కుని యింట్లో కొచ్చేసేడు సూరిబాబు.

❖ ❖ ❖

సూరిబాబు యింట్లోంచి బయపడదేసరికి మున్సిపాలిటీ వ్యాన్ ఎదురయ్యింది. అతన్ని కూడా వ్యాన్‌లో ఎక్కించుకున్నారు.

వ్యాన్‌లో చిన్న చిన్న 'కేజ్'లున్నాయి. వాటిల్లో వీధుల్లో పట్టుకున్న కుక్కల్ని వుంచేరు.

రోడ్డుపక్కనే గజ్జికుక్క కన్పించడంతో వ్యాన్ ఆగింది. పొడుగాటి తాడు వూపుకుంటూ 'డాగ్ క్యాచర్' ఆ గజ్జి కుక్క వెనుకపడ్డాడు. నాలుగు వీధులూ తిప్పి రొప్పుకుంటూ వొకచోట ఆగిందా కుక్క అదే అదననుకుని గురిచూసి కుక్కమెడకేసి విసిరేడు తాడు.

కుక్క ముందుకు వురకడం తాడు వెనక్కు లాగడంతో కుక్కమెడకి వున్న ఉచ్చుముడి బిగుసుకుపోయింది.

"కుయ్ఁ..... కుయ్ఁ" మంటూ మొరగటం మొదలుపెట్టింది గజ్జికుక్క దాన్ని లాక్కెళ్ళి 'కేజ్'లో పడేసేడు.

వ్యాన్‌లో వున్న కుక్కలు కొత్త కుక్క రావడంతో కాసేపు మొరిగేయి.

ఆ కుక్కలకేసి జాలిగా చూసేడు సూరిబాబు.

వాటి ఆయుర్దాయం మరో ఇరవైనాలుగు గంటలు. తిండితిప్పలు లేకుండా ఆ రోజు గదిలో వాటిని వుంచుతారు. మరుసటిరోజు శానిటరీ కాంపౌండర్ వొచ్చి వాటి గుండెల్లోకి సూటిగా ఇంజెక్షన్ చేస్తాడు. క్షణాల్లో వాటి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి.

మరో క్షణంలో పక్కింటి శివుడు గుర్తుకురాగానే వాటిమీద ఏర్పడిన జాలి ఎగిరిపోయింది.

.... శివుడికి ఆరేళ్ళు వుంటాయి. బొద్దుగా, తెల్లగా, అందంగా వుండేవాడు. వాడిని పిచ్చికుక్క కరిచింది. మొదట్లో ఇంటిదగ్గర ఎవ్వరూ పట్టించుకోలేదు. కాకరఆకు రాసి, రాగిముక్క వుంచి కట్టుకట్టారు. కాని లాభం లేకపోయింది. రోగం ముదిరిపోయింది.

నాలుగ బయటపెట్టి దీనంగా చూస్తుండేవాడు. "దాహం, దాహం" అంటూ విలవిల్లాడిపోయేవాడు. మంచినీళ్ళు తెచ్చి యిస్తే బెదిరిపోయి దూరంగా వెళ్ళేవాడు. కుక్కలా ముడుచుకుని పడుకునేవాడు.

చివరిరోజుల్లో కుక్కలా అరుస్తూ ప్రాణాలు విడిచేడు...

ఆఫీసుదగ్గర వ్యాన్ ఆగడంతో ఆలోచనల నుంచి తేరుకుని వ్యాన్‌లో నుంచి కిందకు దూకేడు.

ఆఫీసుకెళ్లగానే వున్న కమీషనర్ ట్రాన్స్‌ఫరై, కొత్తాయన వస్తున్నట్లు తెలిసింది. ఎవరొచ్చినా తన బ్రతుకు మామూలేగదా అనుకుంటూ తన పనిలో తాను మునిగిపోయేడు సూరిబాబు.

సాయంత్రం కమీషనర్ సూరిబాబు కోసం కబురుచేశాడు.

సూరిబాబుకు ఆశ్చర్యమేసింది. తన రెండేళ్ళ సర్వీసులో తననెప్పుడూ కమీషనర్ ప్రత్యేకంగా పిలిపించలేదు.

గదిలోకి వెళ్ళగానే సూరిబాబును కూర్చోమని సంజ్ఞ చేశాడు.

ఆయన తనని కూర్చోమనడం విచిత్రంగా తోచింది.

"చూడు సూరిబాబు! నాకిక్కడ నుంచి పొన్నూరుకు ట్రాన్స్‌ఫర్ వొచ్చింది. కొత్త కమీషనర్‌గారు రేపు చార్జి తీసుకుంటారు."

ఆ విషయాలు తనకెందుకు చెబుతున్నాడో సూరిబాబుకు అర్థంకాలేదు.

"కొత్త కమీషనర్ ఎవరో తెలుసా? మీ అన్నయ్యే!" అన్నాడాయన నవ్వుతూ.

సూరిబాబుకు ఎంతో సంతోషమేసింది. అన్నయ్య ఈ వూర్లోనే వుంటే అమ్మ, నాన్నకి ఎంతో ఆసరాగా వుంటాడనుకున్నాడు.

అతని సంతోషం ఆవిరైపోవడానికి ఎంతోసేపు పట్టలేదు.

"నువ్వేమనుకోకుండా వుంటే వో విషయం చెబుతానోయ్!" సూరిబాబు కళ్ళలోకి చూస్తూ అన్నాడాయన.

"చెప్పండి సార్!"

"మీ అన్నయ్య దగ్గర నువ్వు 'స్వీపర్'గా పనిచెయ్యడం బాగుండదయ్యా! ఆయన సోషల్ ప్రిస్టేజి దెబ్బతింటుంది. నా మాట విని నువ్వు వేరే ఉద్యోగం చూసుకో! మీ అన్నయ్య ఫోన్‌చేసి ఈ విషయం చెప్పేడు."

సూరిబాబు బాధపడ్డాడు...

.... అన్నయ్యే స్వయంగా వొచ్చి ఆ విషయం చెబితే ఎంత బాగుండేది. తనకేమీ ఈ ఉద్యోగం మీద మమకారం లేదు. 'తుమ్మితే వూడిపోయే ముక్కు' లాంటి ఉద్యోగాలు ఎన్నో చేశాడు తను. అన్నయ్య తన ఉద్యోగాన్ని చిన్నచూపు చూస్తున్నాడుగాని ఆ చిన్న

ఉద్యోగాలు చేసి తను సంపాదించిన డబ్బుతోనే అన్నయ్య సర్వీస్ కమీషన్ పరీక్షల ఫీజు కట్టింది. ఆ రోజుల్లో తను కష్టపడుతున్నానని తెగ పొగిడేసేవాడు.... యిప్పుడు తను స్వీపర్ వుద్యోగం చెయ్యడం అన్నయ్య సహించలేదు....

విరక్తిగా నవ్వుకున్నాడు.

'సార్! నాకో తెల్లకాగితంయిస్తారా?" అన్నాడు నెమ్మదిగా.

❖ ❖ ❖

సూరిబాబు తేలికపడిన మనస్సుతో యింటికి చేరుకున్నాడు.

ఇంటిముందు ఆవరణంతా ఆక్రమించిన మామిడిచెట్టుకింద మాట్లాడుకుంటున్న అన్నయ్య, తండ్రి కన్పించేరు అతనికి.

సూరిబాబు కన్పించగానే విసవిసలా నడుస్తూ అక్కడ నుంచి వెళ్ళిపోయాడు ప్రసాదు. సూరిబాబు పల్కరించబోయినా విన్పించుకోలేదు.

మామిడిచెట్టు కింద దిగులుగా నిలబడ్డ తండ్రిని చూడగానే సూరిబాబు మనస్సు కలిసివేసింది... ఆ మామిడిచెట్టంటే నాన్నకెంతో ప్రాణం.... జాగ్రత్తగా పెంచేడు... ఆ చెట్టు విస్తారంగా పెరిగిందేగాని కాయలు కాయడం మాత్రం మర్చిపోయింది....

"అన్నయ్య యిప్పుడే వచ్చాడురా! ఇక్కడే ఉద్యోగం అయ్యిందట... మీ అమ్మ, నేనూ వాడిదగ్గరే వుండాలట... యీ ఇంట్లో వుండలేడట.... నువ్వు ఉద్యోగం మానేయ్యాలట... 'నీ సహాయం అక్కర్లేదు... నువ్వూ అక్కర్లేదు నోరుమూసుకొని పొమ్మన్నాను'..." అన్నాడు వీరయ్య ఆవేశంతో.

"నే నున్నాను నాన్నా! ఈ గుండెల్లో వూపిరి వున్నంతకాలం మీ కేలోటు రానివ్వను నాన్నా!" అన్నాడు సూరిబాబు మనస్ఫూర్తిగా.

పగలంతా మామిడిచెట్టుకిందే కాలక్షేపం చేసే వీరయ్య, ఆ రోజు నుంచి దొడ్లో వేపచెట్టుకిందే కాలక్షేపం చెయ్యసాగేడు.

– 'యువ' మాసపత్రిక డిసెంబరు **1981**